క్లుప్తంగా

సమ్మెను జయప్రదం చేయండి

సీఐటీయూ మండల కన్వీనర్ బాలరాజ్



మాట్లాడుతున్న బాలరాజ్

కందుకూరు: కార్మికుల సమస్యలపై జూన్ 9న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాలరాజ్ కోరారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని నేదునూరులో అంగన్వాడీ టీచర్లు, సిబ్బందితో మాట్లాడారు. కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని సూచించారు. కార్మికుల రక్షణ కోసం పోరాడి సాధించుకున్న 29 చట్టాలను నిర్వీర్యం చేస్తూ, నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చి హక్కులను కాలరాస్తుందని విమర్శించారు. పనికి తగిన కనీస వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఆ రోజు నిర్వహించే సమ్మెలో పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు సరస్వతి, వనజ, షాజహాన్, అనిత, సరస్వతి, కవిత, గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్‌లో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజారులలో కూరగాయల ధరలు(కిలో.. రూపాయల్లో) టమాటా 15, వంకాయ 18, బెండ 40, పచ్చిమిర్చి 35, కాకర 38, బీర 38, క్యాబేజీ 11, ఫ్రెంచిబీన్స్ 85, క్యారెట్ 28, దొండ 15–23, చిక్కుడు 65, గోకర 35, బీట్‌రూట్ 17, క్యాప్సికం 45, ఆలుగడ్డ 24, దోస 15, సొరకాయ 9, పొట్లకాయ 23, ఉల్లిగడ్డ 20, చామగడ్డ 35. గమనిక: ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

చంపాపేటను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి

చంపాపేట: చంపాపేట డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లోని సమస్యలను దశలవారీగా పరిష్కరించి డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని స్థానిక డివిజన్ కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి అన్నారు. మల్‌రెడ్డినగర్‌లో రూ.50 లక్షలతో శుక్రవారం ప్రారంభించిన సీసీ రోడ్ల పనులను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. కార్యక్రమంలో సర్కిల్ ఏఈ సురేష్, కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు గంగాధర్ రెడ్డి, భూపతిరెడ్డి, సత్తయ్య, కృష్ణయ్య, రామ్‌నివాస్ తదితరులు పాల్గొన్నారు.

సర్కిల్ పరిధికి హైడ్రా బైక్



చాదర్‌ఘాట్: మలక్‌పేట సర్కిల్–6 పరిధికి హైడ్రా బైక్‌ను కేటాయించినట్లు సర్కిల్–6 డిప్యూటీ కమిషనర్ జయంత్ తెలిపారు. మలక్‌పేటలో ఆయన మాట్లాడుతూ ప్రధాన రహదారులు, అంతర్గత రహదారుల్లో చెట్లకొమ్మలు, వైర్లు తెగి పడినప్పుడు, రోడ్లు బ్లాక్ అయినప్పుడు వాటిని తొలగించేందుకు హైడ్రా బైక్‌లు వినియోగించాలని అన్నారు. బస్తీల్లో చిన్న చిన్న గల్లీలో చెట్లు కూలినా, కొమ్మలు విరిగినా హైడ్రా వ్యాన్లు ఘటనా స్థలానికి వెళ్లలేక పోతున్నాయన్నారు. దానిని దృష్టిలో పెట్టుకొని హైడ్రా తన సేవలను గల్లీల్లోకి విస్తరించడం జరిగిందని తెలిపారు. ఈ నేపథ్యంలో సర్కిల్‌కు ఒక హైడ్రా బైక్ కేటాయించినట్లు తెలిపారు. ఈ బైక్ వెనుక చెట్ల కొమ్మలు తొలగించే పరికరాలతో కూడిన డబ్బాను ఏర్పాటు చేశారు. ఈ బైక్‌లు నల్గొండ క్రాస్ రోడ్ వద్ద అందుబాటులో ఉంటాయని, ఏదైనా సమస్య వచ్చినప్పుడు ఫోన్ నం. 90001 13667కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి

దిల్‌సుఖ్‌నగర్: డివిజన్ పరిధిలోని కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని ఆర్‌కేపురం కార్పొరేటర్ రాధ అన్నారు. డివిజన్‌లోని పలు కాలనీల్లో శుక్రవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. వర్షాకాలన్ని దృష్టిలో ఉంచుకొని కాలనీలలో ముంపు సమస్యలు రాకుండా చూడాలని అధికారులకు సూచించారు. కాలనీలలో రోడ్లు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని తరచూ ఏర్పడుతున్న వాటర్ లీకేజీలను అరికట్టాలని పేర్కొన్నారు.

కల సాకారమే కాంగ్రెస్ లక్ష్యం

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- అధికార పార్టీ నాయకులు
- పలువురికి మంజూరు పత్రాల అందజేత



కందుకూరు: పెద్దమ్మతండాలో నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న నాయకులు

మహేశ్వరం: కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, ఇతర పథకాలు అందుతాయని ఆ పార్టీ సీనియర్ నాయకుడు మునావత్ పాండు నాయక్ అన్నారు. శుక్రవారం మండల పరిధి గంగారం గ్రామంలో పలువురు లబ్ధిదారులకు మంజూరు పత్రాలను ఇందిరమ్మ కమిటీ సభ్యులు, పార్టీ నేతలతో కలిసి అందజేశారు. ఇళ్ల నిర్మాణానికి ముగ్గు పోశారు. అనంతరం ఆయన మాట్లాడారు.

‘డబుల్’ మోసం..

బీఆర్ఎస్ పదేళ్ల కాలంలో ఏ ఒక్కరికీ డబుల్ బెడ్ రూమ్‌లు ఇవ్వలేదని, అన్నీ ఆ పార్టీ కార్యకర్తలు, నాయకులకే అందజేసిందని ఆరోపించారు. సంక్షేమ పథకాలు ఇవ్వకుండా ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అర్హులందరికీ సొంతింటి కల సాకారం అవుతుందని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్ నాయకత్వంలో పని చేస్తామని తెలిపారు. గంగారం పంచాయతీలో 38 ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. ఇంటి నిర్మాణం 400 ఫీట్లు తగ్గకుండా ఆర్‌సీసీ స్లాబుతో నిర్మాణం చేయాలని, ఉత్తర్వులు వచ్చిన 30 రోజుల్లో ఇంటి నిర్మాణ పనులు మొదలుపెట్టాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు మునావత్ దేవేందర్ నాయక్, మాజీ ఉప సర్పంచ్ సూర్య నాయక్, కేతావత్ రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కందుకూరులో..

కందుకూరు: బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.కృష్ణనాయక్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొక్క జంగారెడ్డి తెలిపారు. శుక్రవారం మండల పరిధి పెద్దమ్మతండా, బంజరుగడ్డ తండాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు లబ్ధిదారులతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఇందిరమ్మ పథకంతో నిరుపేదల సొంతింటి కల నేరవేరనుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుమన్‌నాయక్, నాయకులు ఎ.పాండుగౌడ్, బి.పాండురంగారెడ్డి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

తుక్కుగూడలో..

తుక్కుగూడ: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అర్హులందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు కట్టించి ఇస్తుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బంటు ధనంజయ్ అన్నారు. శుక్రవారం తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధి 6వ వార్డు ఇమామ్‌గూడలో అధికారులతో కలిసి పలు ఇళ్ల నిర్మాణానికి మార్కింగ్ చేశారు. మంజూరు పత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వార్డుకు మొదటి విడతలో 15 ఇళ్లను మంజూరు చేసిందని తెలిపారు. కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు బండ శ్రీను, సిబ్బంది యాదమ్మ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



తుక్కుగూడ: ఇమామ్‌గూడలో మంజూరు పత్రాలు అందజేస్తున్న అధికారులు



మహేశ్వరం: గంగారంలో మంజూరు పత్రాలు అందజేస్తున్న నాయకులు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మీర్‌పేట: మరమ్మతుల కారణంగా శనివారం పలు కాలనీలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని లెనిన్‌నగర్ ఏఈ విజయ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ జనప్రియమహానగర్ ఫీడర్ పరిధి ఎస్ఎల్ఎన్ఎస్ కాలనీ, అయోధ్యనగర్ న్యూ,ఓల్డ్, జనప్రియ మహానగర్ అన్ని బ్లాకుల్లో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు, 11కేవీ ప్రశాంతిహిల్స్ ఫీడర్ కింద సౌభాగ్యలక్ష్మీనగర్, శారదానగర్, శేషాద్రినగర్, కాకతీయకాలనీ, మల్లారెడ్డికాలనీ, సాయిబాలాజీ టౌన్‌షిప్, సీతాహోమ్స్ ఫేజ్– 3, నవయుగ ఎన్‌క్లేవ్, సాయికృష్ణ ఎన్‌క్లేవ్‌లలో మధ్యాహ్నం 3 నుంచి 3.30 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నామని పేర్కొన్నారు. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

హుడాకాంప్లెక్స్‌లో..

హుడాకాంప్లెక్స్: మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ ఫర్హత్‌లలీ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ బీరప్పగుడి ఫీడర్ పరిధి కాలనీల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు, 11కేవీ విజయపురి ఫీడర్ కింది కాలనీల్లో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు, 11కేవీ ఆటోనగర్, హుడాసాయినగర్, మన్సూరాబాద్, సౌత్‌ఎండ్‌పార్కు, ప్రజయ్‌నివాస్, లక్ష్మీనగర్, మోహన్‌నగర్, విశాలాంధ్ర, దేశ్‌ముఖ్ కాలనీ ఫీడర్ల పరిధి కాలనీల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆటంకం కలగనుందని పేర్కొన్నారు.

జైళ్ల శాఖలో వీడ్కోలు సమావేశం



సిబ్బందికి బహుమతి అందజేస్తున్న డీజీ డాక్టర్ సౌమ్య మిశ్రా

చంచల్‌గూడ: తెలంగాణ రాష్ట్ర జైళ్ల శాఖలో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది ఈ నెల 31న ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ క్రమంలో చంచల్‌గూడలోని డీజీ కార్యాలయంలో శుక్రవారం వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఉద్యోగ విరమణ చేయనున్న అసిస్టెంట్ డిప్యూటీ జైలర్ ప్రమీ శాబాయి (హైదరాబాద్), కె.సమ్మయ్య(కరీంనగర్)లను డీజీ డా.సౌమ్య మిశ్రా ఘనంగా సత్కరించారు. ఉద్యోగ కాలంలో జమ చేసిన వెల్ఫేర్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఇరువురు జైళ్ల శాఖకు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఐజీలు యెర్రంశెట్టి రాజేష్, మురళీబాబు, డీఐజీలు డా.శ్రీనివాస్, సంపత్, సిబ్బంది ఉన్నారు.

గోవధకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

చంచల్‌గూడ: గోవధ నిషేధ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని మాదన్నపేట గోశాల ప్రతినిధులు, బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు, మాదన్నపేట మార్కెట్ గోశాల సొసైటీ చైర్మన్ సహదేవ్‌యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం గోప్రేమికులు, నాయకులు సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ కంతిలాల సుభాష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సహదేవ్‌యాదవ్ మాట్లాడుతూ రానున్న బక్రీద్ పురస్కరించుకుని ఎవరైనా గోవధకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. గోవుల అక్రమ రవాణాపై పెద్ద సంఖ్యలో 24 గంటల పాటు చెక్‌పోస్టులను ఏర్పాటు చేయాలన్నారు. పశు సంరక్షణ శాఖ సర్టిఫికెట్ లేని పశువులను వధించకుండా అరికట్టాలన్నారు. ఆరోగ్యంగా ఉన్న గోవులను, ఎద్దులను అక్రమంగా రవాణా చేసి గోనిషేధ చట్టాన్ని ఉల్లంఘిస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్‌జీ, గోశాల అధ్యక్షుడు ఉగాది మహేష్, బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు నిరంజన్‌యాదవ్, సీనియర్ నాయకులు నర్సింహ పాల్గొన్నారు.

వేసవి శిబిరాలతో మరింత ఉత్సాహం




గెలుపొందిన చిన్నారులతో నిర్వాహకుడు రాజశేఖర్‌రెడ్డి

సైదాబాద్: వేసవి శిబిరాలు చిన్నారుల్లో నూతన ఉత్సాహాన్ని నింపుతాయని జేఎస్ఆర్ బ్యాడ్మింటన్ అకాడమి నిర్వాహకుడు రాజశేఖర్‌రెడ్డి అన్నారు. చంపాపేటలోని అకాడమిలో శుక్రవారం వేసవి శిక్షణ శిబిరం ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించారు. బ్యాడ్మింటన్, స్విమ్మింగ్ అంశాలలో వివిధ కేటగిరీల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలకు నిర్వాహకుడు రాజశేఖర్‌రెడ్డి, కోచ్ అబ్దుల్ కుదూస్ పతకాలు, బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మాదిరిగానే తమ అకాడమిలో చిన్నారులకు బ్యాడ్మింటన్, స్విమ్మింగ్‌లో శిక్షణ, పోటీలు నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో చిన్నారులు, తల్లిదండ్రులు, అకాడమి సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేయండి

బీఆర్ఎస్ నాయకురాలి నిరసన



నిరసన తెలుపుతున్న సుమ

మణికొండ: గుంతల మయంగా మారిన రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేసి ప్రజల ప్రాణాలను కాపాడాలని బీఆర్ఎస్ పార్టీకి చెందిన మహిళా నాయకురాలు అదే రోడ్డుపై కూర్చుని నిరసన తెలిపారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ల్యాంకోహిల్స్ సర్కిల్ నుంచి అంజలిగార్డన్‌కు ఉన్న రోడ్డు గతంలో ఓ నిర్మాణ సంస్థకు డ్రైనేజీని ఏర్పాటు చేసేందుకు తవ్వకాలు చేశారు. సదరు నిర్మాణ సంస్థ సరైన పద్ధతిలో మరమ్మతులు చేయకపోవటంతో అక్కడక్కడ కుంగిపోయి అడుగుల లోతు గుంతలు ఏర్పడ్డాయి. వాటిని పూడ్చి రోడ్డును మరమ్మతు చేయాలని అనేక సార్లు మున్సిపాలిటీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదని బీఆర్ఎస్ పార్టీ నాయకురాల సుమనశిని శుక్రవారం అదే రోడ్డుపై కూర్చుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంజలిగార్డన్ రోడ్డు పూర్తిగా గోతుల మయంగా మారి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందిగా మారిందన్నారు. అనేక మంది మహిళలు కింద పడి గాయాల పాలవుతున్నారని, ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని ఆమె కోరారు.

‘కొమ్మలు కొట్టి.. కుప్పలుగా పెట్టి..’

- ఇష్టానుసారంగా చెట్ల కొమ్మలు నరికివేత
- రోడ్డు పక్కన పడవేత
- నెలలు గడిచినా వాటిని తొలగించని వైనం
- ఎన్నిమార్లు ఫిర్యాదు చేసినా స్పందన శూన్యం
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్థానికులు



కాలనీలో కుప్పలుగా వేసిన కొమ్మలు

స్వచ్ఛ డివిజన్‌గా తీర్చిదిద్దుతాం. చెత్త డంపింగ్ బిన్స్ లేకుండా చేస్తాం. స్వచ్ఛ హైదరాబాదే లక్ష్యం. పచ్చదనం పరిశుభ్రత. ఇలాంటి మాటలు మనం నిత్యం జీహెచ్ఎంసీ అధికారులు, కార్పొరేటర్ల నోటి నుంచి వింటుంటాం. ఎక్కడ ఏ కార్యక్రమాల్లో పాల్గొన్నా ప్రజాప్రతినిధులు, అధికారులు స్వచ్ఛతపై ఇలాంటి ఉపన్యాసాలు పరిపాటి. కానీ క్షేత్రస్థాయిలో చూస్తే ప్రకటనలకు విరుద్ధంగా.. ఎక్కడ పడితే అక్కడ చెత్తకుప్పలు, అపరిశుభ్రంగా రోడ్లు, కొట్టి పడేసిన చెట్ల కొమ్మలు దర్శనమిస్తున్నాయి. కాలనీలన్నీ అధ్వానంగా మారాయి. – చైతన్యపురి

చైతన్యపురి డివిజన్‌లో ఏ కాలనీలో చూసినా రహదారుల పక్కన కొట్టి పడేసిన చెట్ల కొమ్మలు కుప్పలుగా కనిపిస్తున్నాయి. విద్యుత్ వైర్లకు తగులుతున్నాయని ఆ శాఖ సిబ్బంది చెట్టు కొమ్మలను కొట్టి అక్కడే వేసి వాటిని తొలగించకపోవడం వల్ల కాలనీల ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. డివిజన్‌లోని సత్యనారాయణపురం, ప్రభాత్‌నగర్ కాలనీ, ద్వారకాపురి కాలనీ, వికాస్‌నగర్, సాయినగర్ కాలనీలలో ఏ రహదారి చూసినా విద్యుత్ సిబ్బంది కొట్టిపడేసి కుప్పలుగా పోసిన చెట్ల కొమ్మలే ఉన్నాయి. వాటిని నెలల తరబడి తొలగించకపోవటంతో ఎండిపోయి అలాగే పేరుకు పోతున్నాయని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. వీటి ద్వారా వర్షాకాలంలో దుర్వాసనతో పాటు దోమలు వ్యాప్తి చెంది పలువురు అనారోగ్యం పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెట్ల కొమ్మలను కొట్టిన విద్యుత్ సిబ్బందికి వాటిని తొలగించే బాధ్యత లేదా..? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. జీహెచ్ఎంసీ సిబ్బంది స్పందించి వాటిని తొలగించేలా చూడాలని కోరుతున్నారు.

నెలల తరబడి అలాగే..



కొట్టి పడేసిన కొమ్మలు నెలల తరబడి అలాగే ఉంటున్నాయి. ఎండకు ఎండి, వానకు తడిసి మురిగి పోతున్నా వాటిని తొలగించడం లేదు. దీంతో కాలనీలో రాకపోకలకు ఇబ్బందులు కలగడమే కాకుండా దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. చెట్ల కొమ్మలను కొట్టి ఇళ్ల ముందే పడేస్తున్నారు. దీంతో అసౌర్యంగా ఉంది. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించాలి.

– ఎండీ షాహీన్, హనుమాన్‌నగర్ కాలనీ

వాహనాలు అందుబాటులో లేక..



విద్యుత్ సిబ్బంది కొట్టిపడేసిన చెట్ల కొమ్మలు కుప్పలుగా పేరుకుపోతున్న మాట వాస్తవమే. చెత్త తరలించే వాహనాలు అందుబాటులో లేకపోవడం పెద్ద సమస్యగా మారింది. ఎప్పటికప్పుడు కొమ్మలను తొలగించకపోవడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. వాస్తవానికి విద్యుత్ శాఖ చెట్ల కొమ్మలు కొట్టే పనులను కాంట్రాక్టర్‌కు అప్పగిస్తారు. సదరు కాంట్రాక్టరే కొమ్మలను తొలగించాల్సి ఉంటుంది. వాహనాలు అందుబాటులో ఉంటే తొలగించేలా చూస్తున్నాం.

– రంగా నర్సింహగుప్తా, కార్పొరేటర్, చైతన్యపురి



ప్రభాత్‌నగర్ కాలనీలో రహదారి పక్కన చెట్ల కొమ్మలు

రోడ్డు సౌకర్యం కల్పించండి

- పులిమామిడి గ్రామస్తుల డిమాండ్



వెంచర్‌ను పరిశీలిస్తున్న ఎంపీఓ గీత తదితరులు

కందుకూరు: రోడ్డు సౌకర్యం కల్పించాలని మండల పరిధిలోని పులిమామిడి గ్రామస్తులు డిమాండ్ చేశారు. గ్రామ రెవెన్యూ సర్వే నంబర్ 138, 139లలో నలంద గార్డెన్స్ పేరుతో ఉన్న వెంచర్‌లో ఏర్పాటు చేసిన రహదారులను అందరూ ఉపయోగించుకునేలా అడ్డుగా ఉన్న కంచెను తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు వారు శుక్రవారం పంచాయతీ కార్యదర్శి రాజుగౌడ్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం ఎంపీఓ గీత, పంచాయతీ కార్యదర్శితో పాటు గ్రామస్తులతో కలిసి ఆ వెంచర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆమెకు ఆ వెంచర్‌లోని రోడ్లతో పాటు పది శాతం స్థలాన్ని గ్రామ పంచాయతీ పేరుతో రిజిస్ట్రేషన్ చేయించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామ పంచాయతీ పరిధిలో రోడ్లు రిజిస్ట్రేషన్ అయితే ఆ మార్గం నుంచి అటువైపు పొలాలకు వెళ్లడానికి ఎవరి అనుమతులు అవసరం ఉండదన్నారు. దీంతో రైతులకు దగ్గర దారి అవుతుందని పేర్కొన్నారు. వెంటనే చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరారు. నిర్వాహకులకు నోటీసులు ఇచ్చి సమస్య పరిష్కరిస్తానని అధికారులు స్థానికులకు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

కార్పొరేటర్ శ్రీవాణి



కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్, అధికారులు

హుడాకాంప్లెక్స్: వర్షకాలాన్ని దృష్టిలో ఉంచుకొని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధి సాయికృష్ణనగర్ కాలనీలో సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సుజాత, వాటర్ వర్క్స్, శానిటేషన్, విద్యుత్ శాఖ అధికారులతో కలిసి ఆమె పర్యటించారు. కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయా శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. బస్తీలలో ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. అసంపూర్తిగా ఉన్న నాలా పనులను త్వరితగతిన పూర్తి చేయించాలన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ.. వానాకాలంలో మురుగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు... పూడికతీత పనులు చేపట్టాలని శానిటేషన్ అధికారులను ఆదేశించారు. రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని చెప్పారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ ప్రశాంతి, జలమండలి డీజీఎం సన్యాసిరావు, డీఈ చందన పాల్గొన్నారు.

మందుబాబులకు అడ్డాగా జీహెచ్ఎంసీ గ్రౌండ్



వనస్థలిపురం గణేశ్ దేవాలయం గ్రౌండ్‌లో మద్యం సీసాలు

వనస్థలిపురం: వనస్థలిపురం గణేశ్ దేవాలయం సమీపంలో యూనియన్ బ్యాంక్ ఎదురుగా ఉన్న గల్లీలోని జీహెచ్ఎంసీ గ్రౌండ్ మందుబాబులకు అడ్డాగా మారింది. రాత్రివేళ యువకులు గుంపులుగా అక్కడికి చేరుకుని బీర్లు, మందు తాగుతూ స్థానికులకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. రాత్రివేళ వారు గొడవలకు పాల్పడుతుండటంతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రివేళ పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించి గ్రౌండ్‌లో యువకులు మందు తాగకుండా కట్టడి చేయాలని వారు కోరుతున్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని విజ్ఞప్తి



పెండింగ్ పనులను జెడ్సీకి వివరిస్తున్న కార్పొరేటర్

చైతన్యపురి: డివిజన్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచి త్వరగా పూర్తి చేసేలా చూడాలని గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి జీహెచ్ఎంసీ ఈస్ట్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌కు విజ్ఞప్తి చేశారు. జోనల్ కార్యాలయంలో శుక్రవారం జెడ్సీని కలిసి డివిజన్‌లో ప్రారంభం అయిన, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనుల గురించి వివరించారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని పనులను త్వరగా పూర్తి చేయాలని కోరారు. న్యూగడ్డిఅన్నారం కాలనీలో జరుగుతున్న స్టామ్‌వాటర్ లైన్ మరమ్మతులు కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ఆలస్యం అవుతున్నాయని ఆరోపించారు. దీంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని, స్టామ్ వాటర్‌లైన్ మరమ్మతు పనులు వేగవంతం చేసేలా ఆదేశించాలని కోరారు. మధురాపురి, శ్రీకృష్ణానగర్, పీఅండ్‌టీ కాలనీ చౌరస్తా, ఇతర ప్రాంతాల్లో నూతన సీసీ రోడ్డు నిర్మాణానికి జీహెచ్ఎంసీ నిధులు మంజూరైనా ఇప్పటి వరకు ప్రారంభం కాకుండా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించి పనులు త్వరగా పూర్తయ్యేలా చూస్తామని జోనల్ కమిషనర్ హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.